క్లుప్తంగా

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : మున్సిపల్ కార్మికుల సమ్మె కాలంలో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లకు జీఓలు విడుదల చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షులు సుంకర రవి కోరారు. ఈ అంశంపై మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్మికులు 16 రోజులు సమ్మె చేపట్టగా ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, అధికారులు స్పష్టమైన హామీలు ఇవ్వడంతో సమ్మె ముగిసిందన్నారు. అయితే ఇంతవరకు జీఓ విడుదల చేయలేదన్నారు. డ్రైవర్లకు రూ.24,500, పారిశుద్ధ్య కార్మికులకు రూ.21,000, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500, కోవిడ్–19 కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న వారికి జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. డిమాండ్లను ఆమోదించకపోతే మళ్లీ సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

8న ప్రత్యేక విద్యుత్ అదాలత్

కడప కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల 8వ తేదీ 'ప్రత్యేక విద్యుత్ అదాలత్' నిర్వహిస్తున్నట్లు కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకూ ఎర్రముక్కపల్లెలోని విద్యుత్ భవన్ కాన్ఫరెన్స్ హాలులో కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రసల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) నిర్వహిస్తున్నామన్నారు. కడప డివిజన్ పరిధిలోని కడప, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, నందిమండలం, పెండ్లిమర్రి, వల్లూరు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యల పై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

ముగ్గురు అరెస్ట్

కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ పరిధిలో స్పోర్ట్స్ స్కూల్ సమీపంలో షేక్ అజాజ్ అహ్మద్, గంగరాం సుబ్బరాయుడు, ఎర్రసాని ప్రవీణ్ కుమార్ రెడ్డిలు అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఎస్ఐ నారాయణ, తమ సిబ్బందితో కలిసి మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్ శివప్రసాద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప తహసీల్దార్ సిద్దల శివప్రసాద్ మంగళవారం కడప నియోజకవర్గంలోని పలు పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో కనీస సదుపాయాలు, పోలింగ్ బూత్‌లో మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంప్, లైట్లు, ఫ్యాన్లు, ఇంటర్నెట్ సౌకర్యం తదితరాలు సక్రమంగా ఉన్నాయా? లేవో? పరిశీలించారు. అనంతరం నగరంలోని పలు సచివాలయాలను పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. జగనన్న కాలనీల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

బయోటెక్నాలజీలో డాక్టరేట్



ఎం. మాధవి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ పరిశోధకురాలు ఎం. మాధవికి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. బయోటెక్నాలజీ ఆచార్యులు పి. చంద్రమతి శంకర్ పర్యవేక్షణలో 'మైక్రోప్రాపగేషన్ అండ్ కన్జర్వేషన్ ఆఫ్ ఆర్కిడ్ స్పీసిస్ ఆఫ్ శేషాచల హిల్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ త్రూ ప్లాంట్ టిష్యూస్ కల్చర్' అన్న అంశంపై చేసిన పరిశోధనకు ఈమెకు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, పరిశోధకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించి ప్రమాదాలను అరికట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా రాయల్ రసీద్ అసోసియేషన్ వారు ముద్రించిన ట్రాఫిక్ నిబంధన కరపత్రాలను, పోస్టర్లను కాగితాలపెంట జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం సయ్యద్ జిలానీబాష, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలరు చెన్నకేశవరెడ్డి, రూటా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీ అక్బర్, జాకీర్ హుస్సేన్ ఆవిష్కరించారు.

మార్చి 9న లోక్ అదాలత్

కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 9న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మెజిస్ట్రేట్ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, బ్యాంక్ కేసుల్లో రాజీ ధోరణిలో ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలి



వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ప్రకాష్ నగర్ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు సచివాలయాలు ఒకే ప్రాంతంలో ఉన్నందున ఒక సచివాలయాన్ని మార్చేందుకు చర్యలు తీసుకోవాలని వార్డు అడ్మిన్, అమినిటీస్ సెక్రటరీలను ఆదేశించారు. ప్రజలు సచివాలయానికి వచ్చినప్పుడు వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్, బిల్డింగ్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వాహనాలకు ఇచ్చేలా అవగాహన తేవాలన్నారు. ప్రకాష్‌నగర్‌లో ఉన్న ఎస్సీ, బీసీ వెల్ఫేర్ హాస్టళ్లను తరచూ తనిఖీ చేయాలని వార్డు ఎడ్యుకేషన్, మహిళా పోలీస్‌కు సూచించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి..

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ అన్నారు. మంగళవారం మార్నింగ్ విజిట్లో భాగంగా అంబేద్కర్ సర్కిల్– వై జంక్షన్, అన్నమయ్య జంక్షన్–క్రిష్ణదేవరాయ సర్కిల్, దేవుని కడప రోడ్, మాసాపేట జంక్షన్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ఇంజనీర్ విభాగ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

మీ బెదిరింపులకు భయపడేవాళ్లం కాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి తమ పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకున్నా, మరో బుక్‌లో రాసుకున్నా భయపడేవాళ్లం కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, పి. జయచంద్రారెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎం. సుబ్బారెడ్డి, ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి, అజ్మతుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు శ్రీనివాసులరెడ్డే ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్నారన్నారు. కడపలో ఒక్క డివైడర్‌కు పెయింటింగ్ వేసిన పాపాన పోలేదన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలే తప్పా బెదిరించి, రౌడీయిజం చేసి ఓట్లు వేయించు కోవాలనుకుంటే మీ వల్ల కాదన్నారు. శ్రీనివాసులరెడ్డి దంపతులకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. మృత్యుంజయకుంటలో వలంటీర్లను టీడీపీ వారే కొట్టి, మళ్లీ వారే కేసు పెట్టారన్నారు. ప్రశాంతంగా ఉన్న నగరంలో వీళ్లు ఘర్షణ రేపాలని చూస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ స్టిక్కర్లను పీకేయాల్సిన ఖర్మ తమకు పట్టలేదన్నారు. వారు ప్రచారం చేసి పోగానే ప్రజలే వాటిని పీకేస్తున్నారని ఎద్దేవా చేశారు. శ్రీనివాసులరెడ్డి, మాధవి చుట్టూ ఉన్న వారెవరికీ కడపలో ఓట్లు లేవని, పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చి రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసే చర్యలు తగవు



మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కళ్యా సుధాకర్

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టడం తగదని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కళ్యా సుధాకర్ తెలిపారు. మంగళవారం నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో ప్రభుత్వ రంగ సంస్థలు– ప్రైవేటీకరణ అనే అంశంపై బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్ నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఇతర సంస్థలకు తరలిపోకుండా 4జి, 5జి సేవలను వెంటనే ప్రారంభించాలని, నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు కొత్త ప్రమోషన్ పాలసీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆకుల సుబ్బారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు యాకూబ్, సుబ్బరాయుడు, ప్రసాద్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి



రామనపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని ప్రతి కుటుంబంలో మేలు జరిగి ఉంటనే మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మిలు ప్రజలను కోరారు. మంగళవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. రామనపల్లె గ్రామ పంచాయతీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన ప్రజల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి వైఎస్సార్ సీపీకి ఓటేసి అత్యధిక మెజారీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి కమలాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశారని ఆయనను మండల ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, మండల సచివాలయాల కన్వీనర్ ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ముఖ్యమంత్రి ధ్యేయం



ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని వృద్ధులను అభ్యర్థిస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అలిదెన, ఈర్లపల్లె గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటును వేసి గజన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపై ఉందని ఓటర్లకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవిందురెడ్డి, అలిదెన మాజీ సర్పంచు వాసుదేవరెడ్డి, రాజారెడ్డి, దేశాయ్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, గంగిరెడ్డి, ప్రతాప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



పందిళ్లపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

కమలాపురం : పేద, బడుగు, బలహీన అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పందిళ్లపల్లెలో మహిళా నాయకురాళ్లు సుమలత, అనిత తదితరులతో కలసి ఆమె ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. మీ కుటుంబానికి ప్రయోజనం కలిగి ఉంటేనే త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు చేయూత

సిద్ధవటం : మండలం లోని మాధవరం–1 గ్రామ పంచాయతీ లోని రెండు కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటును అందించడం జరిగిందని కడప తేజశ్విని చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ మాధవరం–1 గ్రామానికి చెందిన సాధు యశశ్వి రెండవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతుందన్నారు. ఆమె విద్యలో మరితగా రాణించేందుకు ఆమె కుటుంబానికి రూ.25 వేలు స్కాలర్‌షిప్ చెక్కును అందించామన్నారు. అదేవిధంగా రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన మరో నిరుపేద మహిళలకు తోడ్పాటును ఇచ్చే కార్యాక్రమంలో భాగంగా టిఫన్ సెంటర్ నడుపుకునేందుకు అవసరమైన ఇడ్లీ పాత్ర, మిక్సీ, నిత్యావసర వస్తువులు అంజేశామన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్ : స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కళాశాలలో మౌఖిక పరీక్షతోపాటు డెమో నిర్వహించి త్రిసభ్య కమిటీ ఎంపిక ద్వారా నియామకాలు జరుగుతాయన్నారు. కంప్యూటర్ అప్లికేషన్, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు పీజీ డిగ్రీలో 55 శాతం, నెట్, సెట్, పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని పబ్బాపురంలో మంగళవారం సీకేదిన్నె వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలంటే తిరిగి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ హిదాయతుల్లా, సర్పంచులు గంగాధర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, ఎంపీటీసీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలలో విభజన హామీలను విస్మరించిందని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు తులసీశ్వర యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 9 సంవత్సరాలు దాటినా విభజన హామీలను ఏమాత్రం నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలని విభజన చట్టంలో ఉన్నా బీజేపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా విస్మరించిందన్నారు. హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అక్షరాస్యతపై అవగాహన

చెన్నూరు : ప్రతి కుటుంబంలో అక్షరాస్యత కలిగిన వారు ఉంటే ఆ కుటుంబం ఎంతో వృద్ధి చెందుతుందని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా తెలిపా రు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో రామనపల్లె లో నిర్వహిస్తున్న 7 రోజుల స్పెషల్ క్యాంపులో భాగంగా మంగళవారం ఆరవరోజు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ట్లు తెలిపారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆ ఫీసర్ డాక్టర్ జి.విజయలక్ష్మిదేవి వలంటీర్లతో క లిసి గ్రామంలో అక్షరాస్యతపై అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్ర తి ఇంట్లో అక్షరాస్యత కలిగిన కుటుంబ సభ్యు ల యొక్క వివరాలను సేకరించారు. నిరక్షరాస్యులుగా ఉన్న వారికి అక్షరాస్యత యొక్క ప్ర యోజనాలను తెలియజేశారు. రామనపల్లెలో దాదాపు 3500 మంది జనాభా ఉందని అందులో 60 శాతం మంది అక్షరాస్యులుగా ఉన్నట్లు తెలిపారు. గ్రామ జనాభాలో 2527 మందికి ఓటు హక్కు ఉన్నట్లు తెలిపారు.

• ప్రత్యేక పూజలు

కడప కల్చరల్ : గ్రహ బాధల నుంచి తమను తప్పించాలని కోరుతూ మహిళా భక్తులు కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దేవునికడప ఆలయానికి కొత్తగా ముగ్గురు అర్చకులు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా పేరుగాంచిన దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి కొత్తగా ముగ్గురు అర్చకులు వచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అటు తిరుమల–తిరుపతి దేవస్థానాలు, ఇటు దేవదాయ ధర్మదాయ శాఖలోనూ అర్చకులకు వంశ పారంపర్య మిరాశి విధానాన్ని అమలు చేస్తానని ఇచ్చిన మాటను నిలుపుకున్నారని రాష్ట్ర అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు విజయ్ భట్టర్ హర్షం వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాలుగా అర్చకులు ఈ విషయంగా ప్రభుత్వాలను అభ్యర్థిస్తూనే ఉన్నారని, ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ మేరకు వారికి మాట ఇవ్వడమే కాకుండా దాన్ని అమలు చేయడం ఆయా కుటుంబాల్లో వెలుగు నింపినట్లయిందని ఆయన పేర్కొన్నారు. దేవుని కడపలో ఇప్పటికి ముగ్గురు అర్చకులు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం టీటీడీ అధికారులు మిరాశి విధానంలో మరో ముగ్గురు అర్చకులను నియమించడంతో వారికి పని ఒత్తిడి తగ్గిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్‌ఆర్‌సీపీ విజయం ఖాయం



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ అన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్‌ఆర్‌సీపీ ఒంటరిగా పోటీ చేసి అత్యధిక స్థానాలు గెలుపొందడం ఖాయం అని వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముమ్మాటికీ అర్జునుడేనని, ప్రతిపక్షాలు పన్నుతున్న కుట్రలను ఛేదించగల సామర్థ్యం ఉన్న నాయకుడు అన్నారు. చంద్రబాబు నిత్యం కుట్రలు , కుతంత్రాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. టీడీపీ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం, స్కాములే తప్ప ప్రజా సంక్షేమ ఊసే లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోని వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదని, రాబోయే ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఎల్‌ఐసీ నూతన పాలసీ ఇండెక్స్ విడుదల



మాట్లాడుతున్న సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్

కడప కల్చరల్ : ఎల్ఐసీ ఇండెక్స్ ప్లస్ పేరిట జీవిత బీమా సంస్థ నూతన పాలసీని విడుదల చేసిందని సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ తెలిపారు. మంగళవారం సంస్థ కార్యాలయంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. రిస్క్ కవర్‌తోపాటు, మంచి రాబడి లక్ష్యంగా మారుతున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రారంభించామన్నారు. ఇన్వెస్టర్లు నేరుగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలంటే చాలా సాంకేతిక పరిజ్ఞానం, నిత్య జాగరూకత అవసరమని, ఎల్ఐసీ ఇండెక్స్ పాలసీ ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని ఆయన అన్నారు. ఈ పాలసీ ద్వారా నెలకు కేవలం రెండున్నర వేల రూపాయలు కూడా పాలసీదారు ప్రీమియం రూపంలో చెల్లించవచ్చని, అందువల్ల ఇది సాధారణ ప్రజలకు కూడా అనువైనదని అన్నారు. 90 రోజుల వయసున్న పసిపాప నుండి 60 ఏళ్ల వయసున్న వారి వరకు ఈ పాలసీ తీసుకోవచ్చని అన్నారు. పాలసీదారు 10 నుండి 20 సంవత్సరాల ప్రీమియం చెల్లింపు కాలాన్ని ఎంచుకోవచ్చని, అతని వార్షిక ఆదాయానికి ఏడు నుంచి పదిరెట్ల మొత్తం వరకు బీమా పాలసీ తీసుకోవచ్చని అన్నారు. పాలసీ మెచ్యూరిటీ అనంతరం ఫండ్ వాల్యూ చెల్లిస్తారని, దురదృష్టవశాత్తు మరణం సంభవిస్తే ఫండ్ వ్యాల్యూ లేదా బీమా మొత్తం లేదా చెల్లించిన ప్రీమియం మొత్తానికి 105 శాతం ఎల్ఐసి చెల్లిస్తుందని అన్నారు. పాలసీ అమల్లో ఉన్న కాలంలో 6, 10, 15, 20, 25 సంవత్సరాల అనంతరం గ్యారంటీడ్ ఆడిషన్స్ పాలసీకి జమ అవుతాయని అన్నారు. సాధారణంగా స్టాక్ మార్కెట్లోని నిఫ్టీ కంపెనీలలో ఎల్ఐసి దీర్ఘకాలంపాటు ఇండెక్స్ ఫండ్ నిధుల్ని పెట్టుబడులుగా పెడుతుంది కాబట్టి మంచి రాబడికి అవకాశమున్న ఈ పాలసీని పాలసీదారులు తీసుకోవడం ఉత్తమమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, మేనేజర్ సేల్స్ శ్రీనివాస్, ప్రొడక్ట్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో తాళపత్రాలపై సదస్సు నిర్వహణపై వినతి



వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తవ్వా వెంకటయ్య, మూల మల్లికార్జునరెడ్డి

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో వైవీయూ సహకారంతో తెలుగు తాళపత్రాలు, శాసనాలపై ఒక్కరోజు సదస్సు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య కోరారు. మంగళవారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలను ఆయన కలిసి సదస్సు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే ఆంధ్రా, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించారని, రాయలసీమలో వైవీయూలో నిర్వహించదలచినట్లు తెలిపారు. దీనికి వీసీ స్పందిస్తూ సదస్సు నిర్వహణకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లా శాసనాలు, తాళపత్రాలకు కాణాచి కావడం వల్ల విశ్వవిద్యాలయంలో సదస్సు నిర్వహిస్తే సముచితంగా ఉంటుందన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చెన్నూరు : ఆయా శాఖల అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం అధికారుల బాధ్యత అని ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించి వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. జాతీయ రహదారిలో ఇల్లు కోల్పోయిన బాధితులకు రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. బుడ్డాయపల్లె, బయనపల్లెలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ పాఠశాలలను పూర్తిచేయాలన్నారు. కొండపేటలో ప్రభుత్వ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అలాగే ఆరోగ్య ఉపకేంద్రానికి కరెంటులేదని సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ సక్రమంగా బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. చెన్నూరు రెండవ వార్డులో కరెంటు స్తంభాలు నాటారే గాని వాటికి విద్యుత్ తీగల కనెక్షన్ ఇవ్వలేదని ఎంపీటీసీ సాదిక్ అలీ తెలిపారు. కనపర్తిలో చేపడుతున్న జగనన్న గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. మండల వ్యాప్తంగా గ్రామాలలో తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వచ్చిన ప్రతి అంశం వచ్చే సమావేశానికల్లా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్ఆర్ (చిన్న), సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సొంటం నారాయణరెడ్డి, చెన్నూరు సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, ముమ్మడి సుదర్శన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్, ఎంపీటీసీలు, నిరంజన్‌రెడ్డి, నాగిరెడ్డి, సాదిక్ అలీ, అధికారులు తహసీల్దార్, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, ఈవోపీఆర్డీ సురేష్‌బాబు, డాక్టర్ చెన్నారెడ్డి, ఏపీఎం గంగాధర్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.